క్లుప్తంగా

మాజీ వీసీకి సత్కారం



మాజీ వీసీ ఆచార్య బి. ఆంజనేయప్రసాద్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం ప్రథమ వైస్ చాన్సలర్‌గా బాధ్యతలు నిర్వహించి రాజీనామా చేసిన మాజీ వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్‌ను విశ్వవిద్యాలయం అధికారులు, అధ్యాపకులు సన్మానించారు. శుక్రవారం విశ్వవిద్యాలయంలో ఆయన్ను ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు గురు పౌర్ణమి పూజలు

కడప అర్బన్: నగరంలోని నబీకోటలో వెలిసిన శ్రీ షిరీడి సాయిబాబా మందిరంలో ఈనెల 21న గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త గోదిన క్రిష్ణమూర్తి, సతీమణి ప్రమీలమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పల్లకి ఉత్సవం నిర్వహించనున్నామన్నారు.

హెల్మెట్ ధరించండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డాక్టర్ గోపినాథ్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రమాద సమయంలో తమ విలువైన ప్రాణాలు కాపాడుకోవాలని కడపకు చెందిన వైద్యులు గోపినాథ్ పిలుపునిచ్చారు. రాయల్ రషీద్ అసోసియేషన్ హెల్మెట్ ధారణపై రూపొందించిన పోస్టర్లను డాక్టర్ గోపినాథ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొంతకాలంగా జరుగుతున్న రోడ్డుప్రమాదాలను గమనిస్తే ఆందోళన కలుగుతోందన్నారు. ఇటువంటి తరుణంలో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ప్రాధాన్యతను గుర్తించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపరాదని, ఈ విషయంగా తల్లిదండ్రులు చైతన్యవంతులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయల్ రషీద్ అసోసియేషన్ ప్రతినిధి కరీముల్లా, రాజేష్ కుమార్ స్వామి, యోగి పాల్గొన్నారు.

ఇన్‌స్టంట్ పరీక్షలకు అవకాశం కల్పించాలి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు అన్ని పరీక్షలు రాసేందుకు ఇన్‌స్టంట్ పరీక్షల్లో అవకాశం కల్పించాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి, యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.ఎం. ఓబులేసు యాదవ్ కోరారు. శుక్రవారం వైవీయూలో వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2021–24 విద్యాసంవత్సరం డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు 4వ సెమిస్టర్ వరకు ఒక్క పరీక్షకు మాత్రమే అవకాశం ఇచ్చారన్నారు. అన్ని పరీక్షలు రాసుకునే అవకాశం విద్యార్థులకు కల్పించాలని కోరారు. దీనికి స్పందించిన వీసీ వారం రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి పవన్‌కుమార్, నాయకులు యశ్వంత్, ఆదిత్య, సుశాంత్, విశాల్, గౌతమ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ



రక్తదాన వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఆర్‌ఓ తదితరులు

కడప స్పోర్ట్స్: జిల్లాలోని వివిధ స్వచ్ఛందసేవా సంస్థలు, నెహ్రూ యువకేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి 26వ తేదీ వరకు రక్తదాన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్రం జిల్లా కో ఆర్డినేటర్ మణికంఠ తెలిపారు. శుక్రవారం రక్తదాన వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను డీఆర్‌ఓ కార్యాలయంలో డీఆర్‌ఓ గంగాధర్ గౌడ్ ఆవిష్కరించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదాన కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.

రేపు శోభాయాత్ర

కడప కల్చరల్ : నగరానికి చెందిన జగన్మాత మారెమ్మ దేవాలయం, శ్రీ పుష్పగిరి తీర్థక్షేత్ర ధర్మ పరిరక్షణ సమితితోపాటు పలు ఇతర సంస్థలతో కలిసి ఆదివారం అన్నమాచార్యుల వారసత్వ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు కార్యక్రమ కన్వీనర్ సట్టి భారవి, డైరెక్టర్ పి.మీనాక్షి శ్రీనివాస్ తెలిపారు. తాళ్లపాక అన్నమాచార్యుల 12వ తరం వారసులైన తాళ్లపాక స్వామి పాల్గొననున్న ఈ యాత్ర నగరంలోని అన్నమాచార్యుల విగ్రహం వద్దనుంచి ప్రారంభమై దేవునికడప చేరుతుందన్నారు.

కొత్త విషయాలు తెలుసుకుంటున్నాం



భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ బేసిక్ శిక్షణకు రావడం తొలిసారి. శిక్షణలో నాయకత్వ లక్షణాలు, శారీరక దృఢత్వం, సమాజసేవ తదితర అంశాలతో పాటు చాలా అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు ఈ శిక్షణ దోహదం చేస్తుంది. శిక్షణ ఎంతో చక్కగా సాగుతోంది.

– మాద పవన్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు, ఎస్.వి. హైస్కూల్, బయనపల్లె, సీకే దిన్నె మండలం

ఎంతో ప్రయోజనకరం



కడప నగరంలో నిర్వహిస్తున్న స్కౌట్ బేసిక్ క్యాంపు ఉపాధ్యాయులు, స్కౌట్ మాస్టర్లకు ఎంతో ఉపయోగకరం. రెసిడెన్షియల్ విధానంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణలో భారత్ స్కౌట్స్‌కు సంబంధించిన అన్ని అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు నేర్పించేందుకు ఉపయోగపడుతుందని భావిస్తున్నా.

– ఓబయ్య, ఫిజికల్ డైరెక్టర్, తాళ్లమాపురం, ప్రొద్దుటూరు

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు చక్కగా సాగుతున్నాయి. వీటిని విస్తరించేందుకు ఇలాంటి బేసిక్ శిక్షణ శిబిరాలు ఉపయోగపడతాయి. స్కౌట్స్‌లో చేరదలచుకున్న ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు సంబంధిత అధికారుల ద్వారా సంప్రదిస్తే నూతన యూనిట్లు ఏర్పాటు చేస్తాం.

– డి. ప్రమీల, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి, కడప

స్కౌట్ శిక్షణ.. సేవకు నిచ్చెన

విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జాతీయ సమైక్యత అలవర్చేలా విద్యార్థిదశ నుంచే సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించేలా శిక్షణ ఇచ్చే సంస్థ 'భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్'. ఇందులో ప్రవేశించే విద్యార్థులకు చక్కటి మార్గదర్శనం చేసేలా ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో కీలకంగా వ్యవహరించే స్కౌట్ మాస్టర్స్ శిక్షణ కార్యక్రమం కడప నగరంలో ప్రారంభమైంది. ఏడురోజుల పాటు నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమంలో రోజుకో అంశాలపై శిక్షణ ఇస్తూ ఉత్తమ మాస్టర్‌లను తీర్చిదిద్దుతోంది భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్.



బేసిక్ శిక్షణ క్యాంపులో శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు



కడప నగరంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ శిక్షణ కేంద్రం

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం జిల్లాలోని కబ్ (ప్రాథమిక విద్య), స్కౌట్ (సెకండరీ విద్య), రోవర్ (కళాశాల విద్య) మాస్టర్లకు బేసిక్ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు ఏడు రోజుల పాటు రెసిడెన్షియల్ శిక్షణ అందిస్తున్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి డి. ప్రమీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ బేసిక్ శిక్షణ కార్యక్రమానికి లీడర్ ఆఫ్ ది కోర్సుగా జి. వెంకటేశ్వర్లు విచ్చేసి శిక్షణ అందిస్తున్నారు.

వీరితో పాటు క్యాంపు అధికారులుగా లియోప్రకాష్, సూర్యప్రకాష్, ఫణిభూషణ్‌రావు, నాగరాజు, ఉమాపతి వ్యవహరిస్తుండగా, దాదాపు 60 మంది ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు శిక్షణకు హాజరయ్యారు.

శిక్షణలో ఏమి నేర్పుతున్నారంటే..

ఉదయం 5.30 గంటలతో ప్రారంభమయ్యే దినచర్య రాత్రి 10 వరకు కొనసాగుతుంది. అసెంబ్లీ నిర్వహణ, ప్రేయర్, ఫ్లాగ్ ఆవిష్కరణలతో పాటు వివిధ రకాల స్కౌట్ నైపుణ్యాలపై శిక్షణ ఇస్తున్నారు. రోవర్ సెక్షన్‌లోని మెథడ్స్, పాట్రోల్ సిస్టం, బడ్డీ వర్క్, సెరెమనీ విజిల్స్, గ్రూప్ సిస్టం, ఫండమెంటల్స్ ఆఫ్ స్కౌటింగ్, ప్రామిస్ అండ్ లా, గేమ్స్, హాబీస్, పాటలు, క్యాంప్ ఫైర్‌లతో పాటు స్కౌట్స్ గొప్పదనం, ఉపయోగాలు తెలియజెప్పేలా ప్రత్యేక ఉపన్యాసాలు శిక్షణలో ఉన్నాయి.

స్కౌట్స్ ముఖ్య ఉద్దేశ్యం..

- నాయకత్వ నైపుణ్యాలను అభివృద్ధి చేయడం.
- జట్టుకృషిని, సహకారాన్ని ప్రోత్సహించడం.
- ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం.
- శారీరక దృఢత్వం, బహిరంగ కార్యకలాపాలను ప్రోత్సహించడం.
- జీవన నైపుణ్యాలను నేర్చుకోవడం.
- సమాజ సేవాభావాన్ని పెంపొందించడం.
- సాంస్కృతిక అవగాహనను అభివృద్ధి చేయడం.
- వ్యక్తిగత వృద్ధికి అవకాశాలను అందించడం.

ఎవరు అర్హులంటే..

ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేసే ఆసక్తి గల ఉపాధ్యాయులు, పౌరులు అర్హులు. ప్రాథమిక స్థాయిలోని వారికి శిక్షణ ఇచ్చే వారిని కబ్ మాస్టర్లుగాను, మాధ్యమిక స్థాయిలో శిక్షణ ఇచ్చేవారికి స్కౌట్ మాస్టర్లుగాను, కళాశాల స్థాయిలో శిక్షణ ఇచ్చేవారిని రోవర్ మాస్టర్లుగా పేర్కొంటారు. వీరందరూ బేసిక్ శిక్షణ అనంతరం వివిధ క్యాంపులు చేసిన తర్వాత ఆయా విద్యాసంస్థల్లో నూతన యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు వెసులుబాటు ఉంది.

స్కౌట్ కార్యక్రమాలు మరింత విస్తరించాలి

కడప స్పోర్ట్స్: జిల్లాలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలను మరింత విస్తరించేందుకు స్కౌట్ శిక్షణ దోహదం చేస్తుందని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యదర్శి డి. ప్రమీల పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరం శంకరాపురంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ కార్యాలయంలో జిల్లాలోని కబ్, స్కౌట్, రోవర్‌మాస్టర్లకు ఏడురోజుల బేసిక్ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా లీడర్ ఆఫ్ ది కోర్సుగా హాజరైన జి. వెంకటేశ్వర్లు, ఆర్.డి.ఎస్. లియోప్రకాష్, ఎం. సూర్యప్రకాష్‌లు మాస్టర్లకు శిక్షణపై అవగాహన కల్పించారు. క్యాంపు అధికారులు పి. ఫణిభూషణ్‌రావు, సి. నాగరాజు, ఎం. ఉమాపతిలు స్కౌట్స్ ప్రాధాన్యత, ముఖ్య ఉద్దేశ్యాలు, ఉపయోగాలను తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ కోశాధికారి బి. శివశంకర్‌రెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ ఖాదర్‌బాషా, అసిస్టెంట్ స్టేట్ కమిషనర్ లక్ష్మీకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీఎల్ఐ సమస్యలను పరిష్కరించాలి



జీవిత బీమా సహాయ సంచాలకులు రమేష్ బాబుకు వినతిపత్రాన్ని ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని ఉద్యోగ ఉపాధ్యాయుల జీవిత బీమా పాలసీలకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు. ఈ విషయమై శుక్రవారం ఏపీజీఎల్ఐ కార్యాలయంలో జీవిత బీమా సహాయ సంచాలకులు రమేష్ బాబును యూటీఎఫ్ కడప జిల్లా శాఖ పక్షాన కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలామంది ఉద్యోగ ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందారని, వారి పాలసీల గడువు ముగిసి రెండు సంవత్సరాలు పూర్తయినా ఫైనల్ చెల్లింపులు జరగడం లేదని తెలిపారు. అలాగే చనిపోయిన ఉద్యోగులకు చెల్లించాల్సిన పాలసీ సొమ్ములు చెల్లించడం లేదని, ప్రతినెలా ఉద్యోగులు జీవిత బీమా సంస్థకు ప్రీమియం చెల్లిస్తున్నప్పటికీ మిస్సింగ్ క్రెడిట్ ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. అలాగే మిస్సింగ్ క్రెడిట్‌ను నమోదు చేయడంలో జాప్యం జరుగుతున్నదని దీనిని వెంటనే నివారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

అవినీతి అధికారిపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: పూర్వ డీఈఓగా పనిచేసిన రాఘవరెడ్డి అవినీతి అక్రమాలపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఎస్టీయూ కడప జిల్లా శాఖ కోరింది. ఈ విషయమై శుక్రవారం విచారణ అధికారి ఏపీ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ డాక్టర్ ఎం ఆర్ ప్రసన్న కుమార్‌ను కడప ఆర్‌జేడీ కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ కడప జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాషా, సంగమేశ్వర రెడ్డి , బాధిత ఉపాధ్యాయులు సనావుల్లా , అంగడి నాగేంద్ర పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రైవేటీకరణ తగదు



మాట్లాడుతున్న రఘునాథ రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రైవేటీకరణ తగదని, అలాంటి సంఘటనలను ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం కార్యదర్శి రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కడప నగరంలోని డీసీసీబీ సమావేశ మందిరంలో కడప జిల్లా ఉద్యోగుల సమన్వయ కమిటీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో బ్యాంకుల జాతీయీకరణ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ గత 55 ఏళ్లలో ప్రభుత్వ రంగ బ్యాంకులు బ్యాంకింగ్ సేవలను క్లాస్ బ్యాంకింగ్ నుండి మాస్ బ్యాంకింగ్‌గా మార్చాయన్నారు. బ్యాంకులు సామాన్యులకు అందుబాటులోకి వచ్చాయని, మారుమూల గ్రామీణ ప్రాంతాలకు కూడా బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి రావడం జరిగిందన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు ప్రజల కష్టార్జిత పొదుపులకు వేదికలుగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులను బలోపేతం చేయడం, విస్తరించాల్సిన అవసరం ఉన్న తరుణంలో ప్రస్తుత ప్రభుత్వం ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించాలని చూడడం బాధాకరమన్నారు. ప్రభుత్వరంగ బ్యాంకులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి బ్యాంకు ఉద్యోగిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు నాగసుబ్బా రెడ్డి, ఏఐబీఓఏ నాయకులు గరుడయ్య, కోఆర్డినేషన్ కమిటీ అధ్యక్షులు దస్తగిరి, ఆర్గనైజింగ్ సెక్రటరీ అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి మృతదేహం గుర్తించకపోవడం అన్యాయం

– పీఆర్ఎస్ వైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన



కడప గాంధీనగర్ హైస్కూల్ ఎదుట ఆందోళన చేస్తున్న పీఆర్ఎస్‌వైఎఫ్ నాయకులు, విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: చిన్నారి వాసంతి అదృశ్యమై రెండు వారాలు కావస్తున్నా ఇంతవరకు ప్రభుత్వం వాసంతి ఆచూకీని కనిపెట్టలేకపోవటం దారుణం అని ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం (పీఆర్ఎస్ వైఎఫ్) జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు అన్నారు. వాసంతి ఆచూకీని తక్షణం కనుక్కోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కడప గాంధీనగర్ హైస్కూల్ ఎదుట పాఠశాలల విద్యార్థులతో కలిసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఓరుగంటి నాగేంద్రబాబు మాట్లాడుతూ నంద్యాల జిల్లా ముచ్చుమర్రి గ్రామంలో ఈ నెల 7 తేదీన ఆడుకోవడానికి బయటికి వెళ్లిన ఐదో తరగతి చిన్నారి వాసంతిని అదే గ్రామానికి చెందిన ముగ్గురు మైనర్ బాలురు అత్యాచారం చేసి కాలువలో పడేశారన్నారు. ఈ సంఘటనలో ప్రభుత్వం ఆ బాలిక మృతదేహాన్ని గుర్తించడంలో విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఎస్ వైఎఫ్ నగర నాయకులు శ్రీనివాసులు, నరసింహ, తేజ, జహీర్, విద్యార్థులు పాల్గొన్నారు.

రికార్డులను అప్‌డేట్‌గా ఉంచుకోవాలి: ఎస్పీ



సమీక్షలో పాల్గొన్న స్పెషల్ బ్రాంచ్ పోలీసు సిబ్బంది



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు

కడప అర్బన్: రికార్డులను ఎప్పటికప్పుడు పూర్తిస్థాయిలో అప్‌డేట్ చేయాలని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు స్పెషల్ బ్రాంచ్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లాలోని స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది పనితీరుపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ఖచ్చితమైన సమాచారం వచ్చేలా సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని సూచించారు. స్పెషల్ బ్రాంచ్ పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ పలు సూచనలు, సలహాలు చేశారు.

ఈ సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎన్. సుధాకర్, ఇన్‌స్పెక్టర్ యు. వెంకటకుమార్, జిల్లాలోని ఎస్‌బి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ



సాధించిన బహుమతులతో విద్యార్థులు, సిబ్బంది

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని శ్రీ చైతన్య పాఠశాల నందనవనం బ్రాంచ్ విద్యార్థులు నాసా ఎన్ఎస్ఎస్ పోగ్రాంలో ప్రతిభను చాటి బహుమతుల సాధించారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను నాసా ప్రాజెక్టులో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ పోగ్రాంలో కడప శ్రీ చైతన్య పాఠశాల నందనవనం బ్రాంచ్ విద్యార్థులు మూడవ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కడప జోన్ ఏజీఎం డి.రమణయ్య హాజరయ్యారు.

శాకంబరి అలంకారం



కడప కల్చరల్ : కడప నగరం అమ్మవారిశాలలోని శుక్రవారం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవికి శాకంబరిగా అలంకారం చేశారు. ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి దాదాపు 108 రకాల కూరగాయలు, ఆకుకూరలతో కనువిందుగా అలంకారం చేశారు. స్థానిక అర్చకుడు నాగ నరసింహ రోజంతా శ్రమించి 500 కిలోలకు పైగా కూరగాయలు, ఆకు కూరలతో అమ్మవారిని అలంకరించారు. రూ. లక్షన్నర ఖరీదు చేసే పలు రకాల కూరగాయల్లో 300 కిలోలను బయటి ప్రాంతాల నుంచి తెప్పించగా, మిగతా వాటిని స్థానికంగానే కొనుగోలు చేశారు. ఇందులో 65 రకాల కూరగాయలను బెంగుళూరు నుంచి తెప్పించడం విశేషం.

ఆలయ ప్రాంగణంలో ముగ్గులను తలపించేలా వివిధ రకాల కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు శ్రీ ఆర్య వైశ్య మహిళా మండలి ప్రతినిధులు అమ్మవారికి సారె సమర్పించారు. 108 మంది ముత్తయిదువులు సహస్ర కుంకుమార్చనను సామూహికంగా నిర్వహించారు.

ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలి



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఎంఈఓలు గంగిరెడ్డి, ఇర్షాద్ అహ్మద్‌లు

కడప ఎడ్యుకేషన్: కడప మండల పరిధిలో ప్రతి శుక్రవారం పాఠశాలలలో ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా డ్రై డే నిర్వహించాలని కడప మండల విద్యాశాఖ అధికారులు దుద్దికుంట గంగిరెడ్డి, ఇర్షాద్ అహ్మద్‌లు సూచించారు. శుక్రవారం నగరంలోని నాగరాజుపేట నగరపాలక ఉన్నత పాఠశాల, నగరపాలక ప్రాథమిక పాఠశాలలో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు సీజనల్‌లో వచ్చే వ్యాధులు, వాటి నుండి ఎలా కాపాడుకోవాలి, ఎలా జాగ్రత్తగా ఉండాలి అన్న విషయంపై అవగాహన కల్పించారు. అలాగే భోజనం ముందు భోజనం తర్వాత చేతులు శుభ్రం చేసుకునే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. అలాగే పాఠశాల పరిసరాలలో నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తగా ఉంచాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం కవిత సుధారాణి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నిరంజన్ ప్రభు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులకు న్యాయం చేయండి



ఎమ్మెల్యే మాధవీరెడ్డికి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న కడప సీఆర్‌పీలు

కడప ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష ఆధ్వర్యంలో గత 12 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న సీఆర్‌పీలకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు ఎంటీఎస్‌ను అమలు చేసి న్యాయం చేయాలని కడప మండల సీఆర్‌పీలు కోరారు. ఈ విషయమై శుక్రవారం కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా 3 వేల మంది ఉన్నారని, వారందరికి మినిమం టైం స్కేల్ వర్తింప చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కడప మండలతోపాటు సిద్దవటం, మైదుకూరు మండల సీఆర్‌పీలు పాల్గొన్నారు.

జర్నలిజం పరీక్షలు తనిఖీ



జర్నలిజం పరీక్షలను తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం జర్నలిజం అనుబంధ కోర్సులైన పోస్టు గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ పబ్లిక్ రిలేషన్స్, పోస్టు గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ తెలుగు జర్నలిజం పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం నిర్వహించిన పరీక్షను వైవీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్‌టికెట్‌లను, నామినల్‌రోల్స్‌ను పరిశీలించారు. జర్నలిజం శాఖ విభాగాధిపతి తమ్మినేని శ్యామ్‌స్వరూప్ పర్యవేక్షణలో వైవీయూ ఆర్ట్స్‌బ్లాక్‌లో ఈనెల 15వ తేదీ నుంచి పరీక్షలు జరుగుతున్నాయి.

రేపు శివదర్శనానందమాత ప్రసంగం

కడప కల్చరల్ : గురుపౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని ఆదివారం కడప నగరం ఆకులవీధిలో గల శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయంలో స్వామిని శివదర్శనానంద సరస్వతి మాతాజీ ప్రసంగం ఉంటుందని ఆ ప్రాంగణంలోని సత్సంగం నిర్వాహకులు కాకనూరు సుబ్బారెడ్డి తెలిపారు. శ్రీ రాజేశ్వరీదేవి ఆలయంలోని బిట్రా పట్టాభిరామయ్య భగవద్గీత సత్సంగ గౌరవాధ్యక్షులు, సెకండ్ క్లాస్ స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం 7.00 గంటల నుంచి భగవద్గీత సామూహిక పారాయణ ఉంటుందన్నారు. సాయంత్రం 7.00 నుంచి 8.00 గంటల వరకు ప్రొద్దుటూరుకు చెందిన శివదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్టు వ్యవస్థాపకులు గురు వైభవం అంశంపై ప్రసంగిస్తారన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

పెండ్లిమర్రి : రైతులు పంటల సాగు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేస్తే లాభదాయకమని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వర్‌రావు తెలిపారు. శుక్రవారం పెండ్లిమర్రి మండలంలోని చెన్నంరాజుపల్లె పొలాల్లో రైతు నాగేశ్వర్‌రెడ్డి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పత్తి పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటకు పచ్చదోమ, పెనుబంక తెగుళ్ల రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. వాటి నివారణకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో తయారు చేసిన నీమాస్త్రంను పిచికారి చేయాలన్నారు. అలాగే దోమ నివారణకు పసుపు, తెలుపు పల్లాలు, పక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలన్నారు. కొత్తగిరియంపల్లె గ్రామంలో నాగారత్నమ్మ వేసిన సూర్య మండలం మోడల్ 22 రకాల ఆకు కూరలను పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి రామకృష్ణమరాజు, ఏటి ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.